క్లుప్తంగా

భక్తురాలికి బంగారు కమ్మ అప్పగింత



బంగారు కమ్మ అందజేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో పోగొట్టుకున్న బంగారు కమ్మను బాధితులకు గురువారం ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అందజేశారు. పారిశుద్ధ్య కార్మికులు పార్వతికి బంగారు కమ్మ దొరికిన విషయం తెలిసిందే. తిరుపతికి చెందిన డీఎస్ నిహారిక తన కమ్మ పోయినట్టు ఆలయ అధికారులకు తెలిపారు. అంజూరు తారక శ్రీనివాసులు సమక్షంలో రూ.50 వేల విలువ చేసే బంగారు కమ్మను బాధితులకు అప్పగించారు. వారు పాలకమండలి చైర్మన్, పారిశుద్ధ్య కార్మికురాలికి కృతజ్ఞతలు తెలిపారు. పాలకమండలి సభ్యులు పసల సుమతి, రమాప్రభ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): వైఎస్సార్‌ సీపీ తూర్పు, రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ ప్రసాద్‌ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నాయకులు జలదంకి మదన్మోహన్‌ రెడ్డి కోరారు. ఆయన గురువారం మండలంలో ప్రచారం చేశారు. ప్రథమ ప్రాధాన్యత ఓటును పేర్నాటి శ్యామ్‌ ప్రసాద్‌రెడ్డికి వేసి గెలిపించాలని అభ్యర్థించారు. పూడి సచివాలయ కన్వీనర్‌ నరసింహ నాయుడు, కేతినేని వెంగళరావు, అంజూరు రఘురామయ్య, కనపర్తి అశోక్‌, తీర్థ రామన్‌ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా దూర్జటి కళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై గురువారం పలువురు కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శుక బ్రహ్మాశ్రమం ఉత్తరాది పీఠాధిపతి సంపూర్ణానందగిరి స్వామి ప్రవచనం, శ్రీకాళహస్తికి చెందిన వెన్నెల భక్తి రంజని, మాలతి భక్తి సంగీత విభావరి కార్యక్రమాలు అలరించాయి. శ్రీకాళహస్తికి చెందిన శ్రీలాస్య, అద్వైత, కొట్టే గగన శ్రీహిత, హేశ్రిత, కన్నమ్మ, కావ్యాసింగ్‌, తిరుపతికి చెందిన మాధురి, ఐరాలకు చెందిన హంసిక నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. శ్రీవెంకటేశ్వర నాట్యమండలి భీమవరం కృష్ణయ్య ఆధ్వర్యంలో సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకం ఆకట్టుకుంది.

జీ-20 సదస్సుపై అవగాహన అవసరం

పుత్తూరు రూరల్: దేశంలో సెప్టెంబర్‌లో నిర్వహించనున్న జీ-20 సదస్సుపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ కోటేశ్వరయ్య అన్నారు. గురు వా రం కళాశాలలో ఎన్‌సీసీ విభాగం వారు జీ-20 స దస్సుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తొలిసారిగా జీ-20 సదస్సు దేశంలో జరగడం ప్రతి భారతీయుడికీ గర్వకారణమన్నా రు. ప్రపంచ వ్యాప్తంగా అతివేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ గల దేశాధినేతలు సదస్సుకు హాజరవుతున్నారని తెలిపారు.

కనుల పండువగా వసంతోత్సవం



కేడిగం వాహనాలపై ఊరేగుతున్న స్వామి, అమ్మవారు



ఉత్సవ మూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు



త్రిశూల స్నానం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధ్వజావరోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వసంత మండపంలో వసంతోత్సవాన్ని కనుల పండువగా చేపట్టారు. అలాగే త్రిశూలానికి కూడా పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

-తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్)

అలిగితివా సఖీ..

- ముందు పల్లకిలో అమ్మవారు, వెనుక స్వామి
- అద్దంలో అమ్మవారి దర్శనం
- నేడు పల్లకి సేవ



పల్లకి సేవలో అమ్మవారు (ఫైల్)

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మనుషులకే కాకుండా దేవతలకు కూడా సవతిపోరు తలనొప్పులు తెచ్చినట్లు పురాణాల్లో ఉంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేకంగా ఉత్సవం ఉంది. అదే పల్లకీ సేవ. ఎంతో ఇష్టపడి వివాహం చేసుకున్న పరమశివుడు గంగాదేవిని నెత్తిన పెట్టుకున్నాడు. అంతేగాకుండా ఉత్సవాల సమయంలో పక్కనే స్థానం కల్పించాడు. దీంతో జ్ఞానప్రసూనాంబకు ఆగ్రహం కలిగింది. దీంతో స్వామి కోసం ఎదురు చూడకుండా ఆగ్రహంతో విసవిసా ముందు వెళ్లిపోతుంది. ఆమె కోపాన్ని తగ్గించడానికి స్వామి వెనుక పరుగులు తీస్తాడు. ఈ నయనాందకర ఘట్టం శుక్రవారం రాత్రి శ్రీకాళహస్తిలో జరగనుంది. మహాశివరాత్రి ఉత్సవాల్లో ధ్వజావరోహణం పూర్తయిన తర్వాత పల్లకీ సేవ ప్రధానమైనది. ప్రతి ఉత్సవంలో స్వామి వాహనానికి వెనుక, పక్కన వచ్చే అమ్మవారి వాహనం పల్లకీ సేవ రోజు మాత్రం ముందుగా వెళుతుంది. సవతి అయిన గంగాదేవికి ప్రాధాన్యత ఇస్తున్నందుకు కోపగించిన జ్ఞానప్రసూనాంబ పల్లకీలో ముందుగా వెళుతుంది. ఆగ్రహంతో ఉన్నట్లు అమ్మవారిని అలంకరిస్తారు. భక్తులు నేరుగా చూడడం మంచిది కాదని పూజారులు అద్దం అమర్చుతారు. భక్తులు అమ్మవారిని అద్దంలో నుంచి చూడాల్సి ఉంటుంది.

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి



ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాను నాయకులకు అందజేస్తున్న ఆదిమూలం, రమణారెడ్డి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నారాయణవనం: రాష్ట్రంలో మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని వైఎస్సార్‌ సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్సీ ఎన్నికల సత్యవేడు నియోజకవర్గ పరిశీలకులు రమణారెడ్డిలు అన్నారు. గురువారం సాయంత్రం పార్టీ నాయకులకు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాను ఆదిమూలం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో వైఎస్సార్‌ సీపీ బలపరిచిన అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయించి, అత్యధిక మెజార్టీని తీసుకురావాలని సూచించారు. ఏడు మండలాల్లో 7,269 మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకున్నారన్నారు. వంద శాతం పోలింగ్‌ నమోదు కావాలన్నారు. ప్రతి వంద మంది ఓటర్ల బాధ్యతను ఒక నాయకునికి అప్పగించాలని మండల కన్వీనర్లకు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులకు సూచించారు. తమకు కేటాయించిన వంద ఓటర్లతో ఓటు వేయించే బాధ్యతను నాయకుడు సమర్థవంతంగా నెరవేర్చాలని చెప్పారు. మండల కేంద్రంలో పోలింగ్‌ కేంద్రాన్ని ఎన్నికల కమిషన్‌ ఏర్పాటు చేస్తోందని అన్నారు. ఓటర్లను పోలింగ్‌ కేంద్రాలకు చేర్చి వారు ఓటు హక్కును వినియోగించుకునేలా స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి చర్యలు తీసుకోవాలని అన్నారు. మన నమ్మకం- నువ్వే జగన్‌ అన్న నినాదంతో పార్టీ శ్రేణులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్‌, సచివాలయ మండల కన్వీనర్‌ సుధాబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

సత్యవేడు: విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. గురువారం స్థానిక డి.బాబు డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని, బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్నందున ప్రతి విద్యార్థీ ఉత్తమ ర్యాంకుల సాధన కోసం శ్రమించాలన్నారు. విద్యతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థులు సాధించే ర్యాంకుతో కళాశాలకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వస్తుందన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ ఇస్తోందన్నారు. పిల్లలు చదువుకునే సమయంలో ఇబ్బందిలేని వాతావరణంను కల్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం ఇంటర్‌ విద్యార్థులకు నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్‌ కే. సుశీల్‌కుమార్‌ రెడ్డి, సురుటుపల్లి ఆలయ కమిటీ చైర్మన్‌ ఏవీఎం బాలాజీ రెడ్డి, మాస్టర్‌ స్కూల్‌ చైర్మన్‌ కే. చంద్రశేఖర్‌ రెడ్డి, డి.బాబు డిగ్రీకళాశాల కరస్పాండెంట్‌ పరంధామయ్య, మునివేలు, ఉమాపతి, విజయ్‌రెడ్డి, రాబర్టు, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే 15 రోజుల్లో తెలపాలి



మాట్లాడుతున్న కమిషనర్‌ బాలాజీనాయక్‌

శ్రీకాళహస్తి: ఇన్‌ ప్రిన్సిపాల్‌ లేఅవుట్‌ ప్యాట్రన్‌పై అభ్యంతరాలుంటే 15 రోజుల్లోగా రాతపూర్వకంగా తెలియజేయాలని మున్సిపల్‌ కమిషనర్‌ బాలాజీనాయక్‌ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ సర్వే నెం :290/2ఎ, 290/2బి భూమికి లేఅవుట్‌ రెగ్యులరైజేషన్‌ కింద తుడా వారు ఇన్‌ ప్రిన్సిపల్‌ లేఅవుట్‌ ప్యాట్రన్‌ అప్రూవల్‌ చేశారని తెలిపారు. దీనిపై ఎవరికైనా అభ్యంతరాలుంటే 15 రోజులలోపు తెలపాలని సూచించారు.

మద్యం బెల్టుషాపులపై దాడి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పీవీకండ్రిగ పంచాయతీలోని రెడ్డిగుంటబాడవ గ్రామంలో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ మంజునాథరెడ్డి గురువారం సిబ్బందితో కలసి దాడులు చేశారు. దాడుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకుని, 27 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్టుషాపులు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగంగా మద్యం సేవించినా చర్యలు తప్పవన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని లక్ష్మీపురం సర్కిల్‌ వద్ద గురువారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. ఎస్‌ఐ రాఘవేంద్ర కథనం మేరకు.. కేవీబీ పురం నుంచి ద్విచక్ర వాహనంలో శ్రీకాళహస్తికి వస్తున్న సుబ్రమణ్యంను వెనక వస్తున్న రమేష్‌, మణి ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో సుబ్రమణ్యం, మణి గాయపడ్డారు. వారిని 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించండి



బీఎన్‌కండ్రిగలో సర్వేని పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: శిశువుల నుంచి 19 ఏళ్ల వయస్సున్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. ఆయన గురువారం బుచ్చినాయుడుకండ్రిగలో ఎస్‌డీజీ (స్థిరమైన లక్ష్యాలు) సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు వయస్సు తగ్గ పోషకాలను అందించాలని, ఎత్తు, బరువు సమకాలికలో ఉండాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని వృథా చేయకుండా, తినాలన్నారు. ప్రభుత్వం బాలింతలు, గర్భిణులు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు.

మెరుగైన ఫలితాల కోసం ఇంటిబాట



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి విద్యార్థులు పబ్లిక్‌ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి ఇంటి బాట కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం రమణయ్య తెలిపారు. గురువారం మండలంలోని నెలవాయి, కల్లివెట్టు, ఎన్‌టీఆర్‌ నగర్‌ గ్రామాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు తెలుగు ఉపాధ్యాయులు వాణి, జయసుధ, మాధవీలత, రామక్క రాత్రి పూట విద్యార్థుల ఇళ్లకు వెళ్లి చదువుతున్నారా? లేదా, అని పర్యవేక్షించి, విద్యార్థుల సామర్థ్యాలను తల్లిదండ్రులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు హౌస్‌ విజిటింగ్‌ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. దీంతో ఉపాధ్యాయులకు విద్యార్థులు చదువుతున్నారా? లేదా, అని తెలుస్తుందన్నారు.అలాగే పబ్లిక్‌ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు.

ద్విచక్రవాహనాల వేలం రేపు

పాలసముద్రం: మండలంలో సారా అక్రమంగా తరలిస్తూ పట్టుపడిన వాహనాలను శనివారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ బీ సురేష్‌ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సారా కేసులు పట్టుపడిన రెండు ద్విచక్రవాహనాలను పాలసము ద్రం పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొన్న వచ్చని తెలిపారు.

మామిడిలో అంతర పంటలు



మామిడిచెట్లల్లో అంతర పంటగా మిరప

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతులు మామిడి చెట్లల్లో మిరప, మినుము, వేరుశనగ పంటలను అంతర పంటలుగా సాగు చేస్తున్నారు. మండలంలో 180 ఎకరాల్లో సాగులో ఉన్న మామిడి తోటల్లో మిరప, మినుము, వేరుశనగ పంటలను అంతర పంటలుగా సాగు చేస్తున్నారు. ఇవన్నీ ఆరుతడి పంటలు కావడంతో నీటి ఖర్చు తగ్గుతుంది. పంటల దిగబడి బాగా వస్తుందని, మిరప, మినుము, వేరుశెనగ పంటలకు వాడే ఎరువులు, నీటితో మామిడిచెట్లకు పోషకాలు అందుతాయని రైతులు చెబుతున్నారు.

ప్రమాదకరంగా గుంతలు



ప్రమాదకరంగా ఉన్న గుంతలు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని చియ్యవరం నుంచి శ్రీకాళహస్తి బైపాస్‌ రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా అక్కడక్కడా పెద్ద గుంతలు ఉన్నాయి. రాత్రి సమయంలో అవి కనపడకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపుల మట్టి తోలాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగం.. విషమయం

- పెరుగుతున్న ప్లాస్టిక్‌ వ్యర్థాలు
- పర్యావరణానికి పెనుముప్పు



రోడ్డు పక్కన ప్లాస్టిక్‌ వ్యర్థాలు

సత్యవేడు: మండలంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్‌ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. గుట్టలుగా పేరుకుపోయి పర్యావరణానికి పెనుముప్పుగా మారుతున్నాయి. ప్రజలు రోజువారీ అవసరాలకు పాలిథిన్‌ కవర్లు, బ్యాగ్‌లు, ప్లాస్టిక్‌ సీసాలను వినియోగించి వాటిని బహిరంగ ప్రదేశాల్లో పారేస్తున్నారు. ఈ చర్య పర్యావరణానికి పెనుముప్పుగా మారనుంది.

ప్రజల్లో అవగాహనేది..?

ప్లాస్టిక్‌ వినియోగంపై ప్రజల్లో అవగాహనా రాహిత్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్లాస్టిక్‌ ప్రత్యామ్నాయంగా ఉన్న జూట్‌ బ్యాగ్‌లు, చేతి సంచులు వినియోగంపై అవగాహన కల్పించాల్సిన అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలంతా ప్లాస్టిక్‌ కవర్లపైనే ఆధారపడుతున్నారు. 50 మైక్రాన్ల కన్నా తక్కువగా ఉండే ప్లాస్టిక్‌ కవర్లను వినియోగించవద్దంటూ నిషేధించినా అధికారులు అలసత్వం కారణంగా ఎక్కడ చూసినా అవే కనిపిస్తున్నాయి. వస్త్ర దుకాణాలు, పూలు, పండ్లు, చిల్లర వ్యాపారులు ప్లాస్టిక్‌ కవర్లు వినియోగిస్తున్నారు. ఇటీవల కాలంలో ఏ ఇంట్లో శుభ, అశుభ కార్యాలు జరిగినా భోజనం సందర్భంగా ప్లాస్టిక్‌ ప్లేట్లు, గ్లాసులే వాడుతున్నారు. భోజనాల అనంతరం ఆ వ్యర్థాలను రోడ్ల వెంబడి పడేస్తున్నారు. దీంతో ఆ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరించే వ్యర్థాలల్లో ప్లాస్టిక్‌ అధికంగా ఉంటోంది. పంచాయతీ సిబ్బంది తరచూ ప్లాస్టిక్‌ వ్యర్థాలను కాల్చడంతో వచ్చే పొగతో కాలుష్యం పెరుగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే పర్యావరణానికి పెనుముప్పు తప్పదని నిపుణులు చెబుతున్నారు.

హనుమంత వాహనంపై వెంకన్న విహారం



హనుమంత వాహనంపై విహరిస్తున్న స్వామివారు

శ్రీకాళహస్తి రూరల్: తొండమాన్‌పురంలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం రాత్రి స్వామి వారు హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. స్వామిని వేకువజామున సుప్రభాతంతో మేల్కొలిపి వైఖానస ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం స్వామికి విశేష అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి స్వామికి హనుమంత వాహన సేవ నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి 7 వరకు స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం, రాత్రి 7.30 గంటల నుంచి 9 వరకు గరుడ వాహన సేవ నిర్వహించనున్నారు. భక్తులు రూ.500 టికెట్టు తీసుకుని కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చని టీటీడీ అధికారులు తెలిపారు.

తెలుగుగంగ నీరు విడుదలకు చర్యలు

వరదయ్యపాళెం: మండలంలో రెండో పంటకు తెలుగుగంగ నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టారు. పలుచోట్ల సాగు చేస్తున్న వేరుశనగ పంటకు ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని స్థానిక రైతులు గురువారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే తెలుగుగంగ ఈఈ మాట్లాడి, రైతుల సాగునీటి ఇబ్బందులను తెలియజేశారు. స్పందించిన ఈఈ శుక్రవారం నుంచి తెలుగుగంగ నీటి విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నీటి విడుదలకు చొరవ చూపిన ఎమ్మెల్యేకు పలువురు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



క్లుప్తంగా

కందాడులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని కందాడులో శుక్రవారం రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్, తిరుపతి టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్, దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కందాడు, ఎస్సీ, ఎస్టీ కాలనీలకు చెందిన 105 మందికి నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వారం క్యాన్సర్, హైపటైటిస్, బీపీ, మెమోగ్రామ్ పరీక్షలు చేశారు. 30 నుంచి 65 ఏళ్ల లోపు మహిళలు ప్రతి 6 నెలలకు పరీక్షలు చేసుకోవాలని సూచించారు. దంత వైద్యుడు భార్గవ్, టాటా ట్రస్ట్ కో–ఆర్డినేటర్ రెడ్డికుమారి, ప్రోగ్రాం మేనేజర్ పీవీ హేమంత్‌కుమార్, రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ ఫీల్డ్ అధికారి ఎలగిరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆహ్వానం

శ్రీకాళహస్తి: పట్టణంలో ఈ నెల 28న నిర్వహించనున్న టైలర్స్ దినోత్సవానికి రావాలని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్, శ్రీకాళహస్తి టైలర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులును ఆ సంఘం నాయకులు శుక్రవారం ఆహ్వానించారు. వారు ఆయనను ఆలయ పరిపాలన భవనంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. చాంద్‌బాషా, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, అశోక్, రాజా, కృష్ణ, జుప్రుల్ల, సుధ బత్తెయ్య పాల్గొన్నారు.

పిల్లల్లోని సృజనకు పదును



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

రేణిగుంట: పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతకు ఆర్ట్ కళ ద్వారా పదును పెట్టవచ్చని రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ జయచంద్రనాయుడు తెలిపారు. కరకంబాడిలో ఉన్న రాస్ కార్యాలయంలో శుక్రవారం రాస్ బాలాజీ బాల వికాస్ ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా సహకారంతో దత్తత గ్రామాల్లోని పిల్లలకు ఆర్ట్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు వేస్ట్ మెటీరియల్‌తో ఆకర్షణీయమైన ఆకృతులతో బొమ్మలను తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం ఉత్తమమైనవి బొమ్మలు తయారుచేసిన పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కో ఆర్డినేటర్ భారతి, నాగేంద్ర, శైలజ, పార్వతి పాల్గొన్నారు.

మల్లాది డ్రగ్స్‌లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రేణిగుంట: ఈఎస్ఐ ఆస్పత్రి డాక్టర్లు శుక్రవారం గాజులమండ్యం ఎస్టేట్‌లోని మల్లాది డ్రగ్స్ కర్మాగారంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈఎస్ఐ కార్పొరేషన్ 71వ ఆవిర్భావ వార్షికోత్సవాల్లో భాగంగా ఈఎస్ఐ సేవలను కార్మికులకు మరింత చేరువ చేసేందుకు వివిధ కంపెనీల్లో మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. అనంతరం మల్లాది డ్రగ్స్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు ఏవీఎస్‌ప్రసాద్, శివమహేశ్వర, సంతోష్‌నాయక్ పాల్గొన్నారు.

పంటలపై పందుల దాడులు



పందులు ధ్వంసం చేసిన వరిపంట

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని రైతులు సాగు చేసిన వరిపంటపై పందులు దాడులు చేసి, ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుచ్చినాయుడుకండ్రిగలో పందులను పెంచుతున్న వారు పందులను పొలాల్లోకి తోలుతున్నారని, దీంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. పందుల పెంపకందార్లకు ఈ విషయమై పదేపదే చెప్పినా పట్టించుకోవటంలేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లుతామని రైతులు తెలిపారు.

ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు సమీపంలో శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడి ఇద్దరు గాయపడ్డారు. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు.. వెంకటగిరికి చెందిన శివరాజ్(42), లక్ష్మణ్(34) ద్విచక్ర వాహనంపై తిరుపతికి బయలుదేరారు. అంజిమేడు వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. గాయపడిన ఇద్దరిని స్థానికులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గరుడ వాహన గోవిందా





కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

- వైభవంగా స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం
- నయనానందకరంగా గరుడ వాహన సేవ

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గరుడ సేవ అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారు మోహినీ అవతారంలో పల్లకీపై ఊరేగారు. తెల్లవారుజామున స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం స్వామి దివ్య మోహినీ రూపంలో తిరుచ్చిపై చిన్ని కృష్ణుడిగా కొలువుదీరారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఏర్పాటు



విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

చేసిన కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు.

నయనానందకరంగా గరుడ సేవ

రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య స్వామి వారు గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మోత్సవాల్లో గరుడ వాహనం అత్యంత ముఖ్యమైన ఉత్సవం. గరుడ వాహనంపై ఉన్న శ్రీవారిని దర్శిస్తే మోక్షం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. భక్తుల కోలాటాలు, చెక్క భజనలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి ఊరేగింపు సాగింది. గోవింద నామస్మరణలతో తొండమాన్‌పురం మారుమోగింది.

నేడు గజవాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గజవాహన సేవ వైభవంగా జరగనుంది. రాత్రి 7 గంటల నుంచి 8.30 మధ్య స్వామి గజ వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించనున్నారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల వసంతోత్సవం జరగనుంది.

ఎమ్మెల్సీ అభ్యర్థి సిపాయికి సన్మానం



డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంను సన్మానిస్తున్న రేణిగుంటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు

రేణిగుంట: వైఎస్సార్ సీపీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంను శుక్రవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో రేణిగుంటకు చెందిన నాయకులు ఘనంగా సన్మానించారు. రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, గాజులమండ్యం సర్పంచ్ గంగారి రమేష్, జువ్వల దయాకర్‌రెడ్డి, ఎంపీటీసీ శశికిరణ్, యోగేశ్వరరెడ్డి తదితరులు శాలువాతో సత్కరించారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

సత్యవేడు: అటవీ అభివృద్ధి సంస్థ ప్రాంగణంలోని విశాలాక్షి విశ్వనాథస్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా శుక్రవారం నిర్వహించారు. శ్రీవసరాజు విగ్నేశ్వర ఆలయ(పుష్కర) మహా సంప్రోక్షణ మహోత్సవాలు 17 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించారు. ఆలయంలో విఘ్నేశ్వరుడు, శివపార్వతులు తదితర విగ్రహాలు ప్రతిష్టించి, 24 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కుంభాభిషేక మహోత్సవాలు, ఆదిదంపతుల కల్యాణం వేడుకగా నిర్వహించారు. అర్చకులు రంజిత్ స్వామి ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు శివపార్వతులు కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు



ఊరేగుతున్న శివపార్వతులు

కొబ్బరి కాయలు కొట్టి కర్పూరహారతులిచ్చారు. ఆలయ పూజారి అయ్యప్ప భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎఫ్‌డీపీ ఇన్‌చార్జి డివిజినల్ మేనేజర్ గీతిక, సుధాకర్ పాల్గొన్నారు.

ఆలయాలు మానసిక వికాస కేంద్రాలు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : ఆలయాలు మానసిక వికాస కేంద్రాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె, మండల ఇన్‌చార్జి పవిత్రారెడ్డి తెలిపారు. మండలంలోని కత్తివారికండ్రిగ హరిజనవాడలో శుక్రవారం గంగమ్మ, వెంకటేశ్వర స్వామి ఆలయాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి భక్తవత్సలం, వైఎస్సార్ సీపీ నాయకులు నాగరాజు, ప్రతాప్, రంగయ్య, సుధాకర్, గురవయ్య పాల్గొన్నారు.



భూమిపూజలో పాల్గొన్న బియ్యపు పవిత్రారెడ్డి

డ్రగ్స్ నియంత్రణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: ఎస్ఈబీ అధికారులు శుక్రవారం స్థానిక విక్రమ్, వంశీ కళాశాలలో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. సీఐ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను మాదక ద్రవ్యరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించారు. ఎస్ఈబీ అధికారులు నరసింహులు, మనోహర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

పిచ్చాటూరు: నాగలాపురంలో ఉన్న భద్రావతీభావనారుషుల కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయంలో నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం భద్రావతీభావనారుషులకు వేడుకగా అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ మహామండపంలో కల్యాణ వేదికపై ఉత్సవమూర్తులను ఆశీనులు చేశారు. మంగళవాయిద్యాలు వేద మంత్రోచ్చారణల నడుమ అశేష భక్తజనుల సమక్షంలో భద్రావతీభావనారుషుల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సందాల జయపెరుమాళ్, వాసంతి దంపతులు



అర్చకులకు సారె అందజేస్తున్న పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు జయపెరుమాళ్

సారె సమర్పించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. ఏర్పాట్లను పద్మశాలి సంఘం సభ్యులు పర్యవేక్షించారు.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సిపాయి సుబ్రమణ్యం ఒక్కరే పోటీలో ఉన్నారు. ఆయన ఎన్నికను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. బీసీలకు ఉన్నత పదువులు ఇచ్చిన సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చిత్ర పటానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, సర్పంచ్ మంజుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు మునిరత్నంరెడ్డి, కోదండరామిరెడ్డి, బీసీలు మోహన్‌రెడ్డి, సుబ్రమణ్యం, అర్జున్, నాదముని,శివ, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గురవారెడ్డి తదతరులు

వేమలమ్మకు ఘనంగా పొంగళ్లు



పొంగళ్లు పెడుతున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామదేవత వేమలమ్మకు శుక్రవారం గ్రామస్తులు ఘనంగా పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వేమలమ్మకు విశేషాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

రేణిగుంట: పట్టణంలోని అప్పన్న టెక్స్‌టైల్స్ అధినేత రాజశేఖర్ గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. శ్రీకాళహస్తిలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితుడినై పార్టీలో చేరినట్టు రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం సభ్యులు బుల్లెట్ జయశ్యాంరాయల్, చంద్ర, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన అప్పన్న టెక్స్‌టైల్స్ అధినేత

వైభవంగా శ్రీకృష్ణ మందిర మహాకుంభాభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ సన్నిధి వీధిలో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో శుక్రవారం మహాకుంభాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. కొళత్తూరు కన్నయ్య అనే మేస్త్రీ 22 ఏళ్ల క్రితం శ్రీకృష్ణ మందిరాన్ని నిర్మించారు. ఆయన కుమారులు కొళత్తూరు రవి, కొళత్తూరు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో మహాకుంభాభిషేక పూజలు జరిగాయి. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకృష్ణ మందిరానికి మహాకుంభాభిషేకం నిర్వహించడం సంతోషకరమన్నారు. స్థానికుల్లో ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ముత్యాల వెంకటకృష్ణ, తేజ, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



పూజాద్రవ్యాలు తీసుకువస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

ఆదమరిస్తే ఆస్పత్రికే..



బుచ్చినాయుడుకండ్రిగ మెయిన్‌రోడ్డులో కల్వర్టు వద్ద ఏర్పడిన గుంత

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని కేటీ రోడ్డులో నిర్మించిన కల్వర్టు, రోడ్డు పక్కన భారీ వర్షాలకు మట్టి కొసుకుపోవటంతో గొయ్యిలు ఏర్పడి ఉన్నాయి. వాహనాచోదకులు ఆదమరిచి గొయ్యిలోకి దిగారో అంతే ఆస్పత్రికి పోవాల్సిందే. ఈ రోడ్డుపై రోజుకు సుమారు 700 వాహనాలు తిరుగుతుంటాయి. బుచ్చినాయుడుకండ్రిగ మెయిన్ రోడ్డులోని కల్వర్టుకిరువైపుల, చెక్‌పోస్టు వద్ద రోడ్డు పక్కన మట్టి భారీ వర్షాలకు కొట్టుకుపోయి, గోతులు ఏర్పడ్డాయి. వీటిని పూడ్చాల్సిన అవసరం ఉంది.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కోత తగదు

రేణిగుంట: కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి నిధుల కేటాయింపులో కోత విధించడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటరమణ తెలిపారు. సీపీఎం నేతలు శుక్రవారం రేణిగుంటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పథకం ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా తీరని ద్రోహం చేస్తోందన్నారు. బీజేపీ ద్రోహాన్ని రాష్ట్రంలోని అన్ని పార్టీలు ప్రశ్నించాలన్నారు. నరసింహారెడ్డి, శివానందం, సెల్వరాజ్, దిలీప్‌బాషా, సత్యశ్రీ, ఈశ్వరి, లక్ష్మి, కృష్ణ, పద్మమ్మ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



రేణిగుంటలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

శ్రీకాళహస్తి రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఆ పార్టీ బలపరుస్తున్న చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని జెడ్పీటీసీ కావిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి కోరారు. ఆయన శుక్రవారం ఊరందూరు, బీవీపురం, తొండమనాడు, తొండమాన్‌పురం, వేడాం, ఓబులాయపల్లి తదితర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కోరారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించిందన్నారు. సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 14 వేల పోస్టులను భర్తీ చేయడానికి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జలదంకి మదన్‌మోహన్‌రెడి పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి

ఆకట్టుకున్న కళాకారుల నృత్య ప్రదర్శనలు





దూర్జటి కళవేదికపై ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తీశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా దూర్జటి కళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై శుక్రవారం పలువురు కళాకారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీకాళహస్తికి చెందిన మునిపూజిత, నేహాసాయి జాదవ్, జోషితసాయి, తిరుపతికి చెందిన అభినయ ఆర్ట్స్, బెంగళూరుకు చెందిన సుజేంద్రబాబు, హైదరాబాద్‌కు చెందిన భాగ్యవతి నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. తిరుపతికి చెందిన రఘునాథ్ భక్తి రంజని, కాకినాడకు చెందిన పీవీ రమణ ఘంటశాల భక్తి సంగీత విభావరి వీనుల విందుచేశాయి. నాయుడుపేటకు చెందిన చెంగాలమ్మ నాట్య మండలి పక్కీరయ్య బృందం విశ్వామిత్ర ప్రతిజ్ఞ పౌరాణిక నాటకం భక్తులను ఆకట్టుకుంది.

నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు

కేవీబీపురం: వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ రాయదుర్గం మునిలక్ష్మి సూచించారు. శుక్రవారం కేవీబీపురం మండల కార్యాలయంలో ఎంపీడీఓ రామచంద్ర అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు సమావేశంలో పాల్గొని, పలు సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఎంపీపీ మట్లాడుతూ ఈ వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చ ర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కాలంలో సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే కేవీబీపురం, కొత్తూరు గ్రామాల్లో వాటర్ ట్యాంకులను నిర్మించామని తెలిపారు. మైక్రో ఇరిగేషన్, వ్యవసాయ శాఖ, హార్టికల్చర్, రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తున్న సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని కోటమంగాపురం, దిగువపుత్తూరు, ఎగువపుత్తూరు గ్రామాల నాయకులు విద్యుత్ అధికారులు, సిబ్బందిపై ఎంపీపీ మునిలక్ష్మికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీపీ ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గవర్ల కృష్ణయ్య, తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మునెమ్మ, వైస్ ఎంపీపీలు సరస్వతి, శ్రీనివాసులయాదవ్, పార్టీ నాయకులు నందకుమార్, లాల్‌బాబుయాదవ్, బొర్రామాధవి, శాస్త్రిరాజు, ఎంపీటీసీ సభ్యులు మూర్తి సుబ్బయ్య పాల్గొన్నారు.

సీహెచ్‌సీ గైనగాలజిస్టుగా రాజేశ్వరి



సత్యవేడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గైనకాలజిస్టుగా డాక్టర్ రాజేశ్వరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నాలుగు నెలలుగా వైద్యశాలలో గైనకాలజిస్టు పోస్టు భర్తీ కాకపోవడంతో సత్యవేడు ప్రాంతంలోని మహిళలు, గర్భిణులు, బాలింతలు వైద్య పరీక్షలకు ఇబ్బందులు పడ్డారు. గర్భిణులు ప్రసవ సమయంలో మెరుగైన వైద్యం కోసం తిరుపతి, చెన్నై, శ్రీకాళహస్తి, నగరి వైద్యశాలలకు వెళ్లేవారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జిల్లా కలెక్టర్, వైద్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో మహిళా డాక్టర్‌ను నియమించారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ స్థానిక వైద్యశాలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, గర్భిణులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. వైద్యశాల అభివృద్ధి సలహా మండలి సభ్యులు గోవిందస్వామి, మునికృష్ణయ్య, దిన్నూరు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్లు విద్యాసాగర్, చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం జేకేసీ, క్వెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో డిక్సన్ పరిశ్రమలో సీసీ టీవీ, టీవీ మ్యానుఫ్యాక్చరింగ్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.10,603 నుంచి రూ.14 వేల వరకు జీతం ఇస్తారని పేర్కొన్నారు. అలాగే అడిషనల్ బెనిఫిట్స్ ఉంటాయన్నారు. ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ జి.రమేష్, మెంటర్ పి.గిరిబాబు, అధ్యాపకులు సత్యనారాయణరెడ్డి, చంద్రమౌళి, డిక్సన్ హెచ్‌ఆర్ వినయ్‌కుమార్, లక్ష్మి తనూజ తదితరులు పాల్గొన్నారు.

బస్సు నడపాలని మహిళల నిరసన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు గ్రామానికి ఆర్టీసీ బస్సును నడపాలని శుక్రవారం గ్రామంలోని బస్టాండ్ వద్ద మహిళలు నిరసన తెలిపారు. ఈ వారు మాట్లాడుతూ గతంలో గ్రామంలోకి ఆర్టీసీ అధికారులు బస్సు నడిపేవారని, ఇప్పుడు బస్సులు గ్రామంలోకి రాకుండా సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, బైపాస్‌లో వెళ్లిపోతున్నాయని తెలిపారు. సూళ్లూరుపేట రోడ్డు నుంచి గ్రామంలోని రెండు కిలోమీటర్ల దూరం ఉందని, బస్సు లేకపోవటంతో నడవలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు నడపాలని అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని వాపోయారు. అధికారులు స్పందించి బస్సును నడపాలని మహిళలు కోరారు.



నిరసన తెలుపుతున్న మహిళలు